

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 20-01-2026 | సంపుటి - 26 | సంచిక -241 | రూ : 4 | పేజీలు: 8


# మేడారం మెరిసేలా

- ప్రభుత్వ సంకల్పం, అమ్మవార్ల దయతోనే వంద రోజుల్లో గద్దెల పునర్నిర్మాణం
- సమ్మక్క, సారలమ్మల గద్దెల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వన దేవతలకు మొక్కుల చెల్లింపు
- పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు



2లో




2లో

## యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబానికి
# అపురూపమైన కానుకలు ఇచ్చిన ప్రధాని

- భారత్‌కు చేరుకున్న యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్
- విమానాశ్రయానికి వెళ్లి స్వయంగా స్వాగతించిన ప్రధాని మోదీ
- భారతీయ సంప్రదాయ ఉయ్యాలతో పాటు ప్రత్యేక కానుకల బహూకరణ
- "నా సోదరుడు" అంటూ సోషల్ మీడియాలో ప్రధాని మోదీ పోస్ట్
- ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు



2లో

## హిందువులపై దాడులు..
## స్పందించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

- వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవంటూ ప్రకటన
- చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగినవారు చేసినవేనన్న బంగ్లాదేశ్
- 645 ఘటనల్లో 71 మతపరమైనవని వెల్లడి

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఈ నెల 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు కాల్పులు
- మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు



2లో



2లో

## 270 ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కేరళ కుంభమేళా

- నీల నది తీరంలో మహా మాఘ మహోత్సవం ప్రారంభం
- ధర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి ప్రారంభించిన గవర్నర్
- చివరిసారి 1755లో పూర్తిస్థాయి మహోత్సవం జరిగినట్లు రికార్డులు



2లో

## తిరుమలలో రథసప్తమికి
# విస్తృత ఏర్పాట్లు

- ఈ నెల 25న రథసప్తమి
- సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలు
- ఏడు వేర్వేరు వాహనాలపై విహరించనున్న వేంకటేశ్వర స్వామి

## మేడారం మహా జాతరలో
# తప్పిపోతారనే భయం లేదిక..

- వనదేవతల జాతరలో హైటెక్ నిఘా
- పిల్లలు, వృద్ధులకు జియోట్యాగింగ్
- తప్పిపోతే దొరికేలా జియోట్యాగ్స్
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు

2లో



# మేడారం మెరిసేలా

వరంగల్: మేడారంలో వన దేవతల గద్దెల పునర్నిర్మాణ పనులను ప్రభుత్వ సంకల్పం, అమ్మవార్ల దయతో వంద రోజుల్లోనే పూర్తి చేశామని... ఇందులో అందరి కృషి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగు జిల్లా మేడారంలో పునర్నిర్మించిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మల గద్దెలను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆదివారం మేడారానికి చేరుకుని... అభివృద్ధి పనుల పరిశీలన, మంత్రివర్గ సమావేశం, ఆదివాసీ సంప్రదాయ కళాప్రదర్శన కార్యక్రమాలతో బిజీగా గడిపిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దలు రాత్రి ఇక్కడే బస చేశారు. సోమవారం ఉదయం 6:40 గంటలకు గద్దెల పునర్నిర్మాణానికి సూచికగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం ఆవిష్కరించారు. తన సతీమణి, కుమార్తె, అల్లుడి సమక్షంలో మనవడితో కలిసి ఎత్తు బంగారాన్ని(బెల్లం) అమ్మవార్లకు మొక్కుగా సమర్పించారు. తర్వాత అంతా కలిసి గద్దెలను దర్శించుకున్నారు. వీరందరికీ పూజారులు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. అంతకుముందు గద్దెల వద్ద అతిథులకు ఆదివాసీ సంప్రదాయ డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. గద్దెల ప్రారంభోత్సవం సందర్భంగా పాత్రికేయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముచ్చటిస్తూ... మేడారంలో చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు. ప్రభుత్వం చేపట్టిన పనులపై అభిప్రాయం చెప్పాలని వారిని అడిగారు. మేడారంలో చేపట్టిన నిర్మాణాలు, ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. ఇంకా చేయాల్సినవి ఏమైనా ఉంటే చెప్పాలని అధికారులకు సూచించారు. మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన అంశాలపై వారితో చర్చించారు. గద్దెల వద్దకు చేరుకున్న సమయంలో భక్తులతో కరచాలనం చేస్తూ... వారిని ఆప్యాయంగా పలకరించారు. భక్తులు, పూజారులు, కళాబృందాలు, అధికారులతో ఉత్సాహంగా ఫొటోలు దిగారు. మేడారంలో గద్దెల పునర్నిర్మాణంలో పాలుపంచుకున్న అధికారులను అభినందించారు.

* **సీఎం, మంత్రులు, అధికారులు... 14 గంటలు మేడారంలోనే**

మేడారానికి గతంలో పలువురు ముఖ్యమంత్రులు వచ్చినా ఎవరూ ఇక్కడ బస చేయలేదు. ఈసారి ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు సుదీర్ఘ సమయం ఇక్కడే ఉండటం విశేషం. మంత్రివర్గ సమావేశాన్ని సైతం వన దేవతల చెంతనే నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 5:40 గంటల సమయంలో ఇక్కడికి చేరుకున్న సీఎం... సోమవారం ఉదయం 7:40 గంటలకు హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమయ్యారు. సుమారు 14 గంటలపాటు మేడారంలో ముఖ్యమంత్రి పర్యటన సాగింది. దావోస్‌కు వెళ్లాల్సి ఉండటంతో ఉదయమే గద్దెల ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలు ముగించుకున్నారు.

## ట్రంప్ వ్యాఖ్యల ఎఫెక్ట్..
# రికార్డు స్థాయికి చేరిన పసిడి, వెండి

ఢిల్లీ: సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి ధరలు ఈరోజు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరాయి. గ్రీన్‌లాండ్ వివాదం నేపథ్యంలో పలు యూరోపియన్ దేశాలపై కొత్తగా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో ఇన్వెస్టర్లు బంగారం వైపు పరుగులు పెట్టారు. దీంతో అంతర్జాతీయంగా, దేశీయంగా పసిడి, వెండి ధరలు కొత్త రికార్డులు సృష్టించాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఫిబ్రవరి ఫ్యూచర్స్ బంగారం ధర 1.68 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,44,905 పలికింది. అలాగే మార్చి ఫ్యూచర్స్ వెండి ధర ఏకంగా 4.39 శాతం వృద్ధితో కేజీకి రూ. 3,00,400 వద్ద ఆల్ టైమ్ హై రికార్డును నమోదు చేసింది. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో కూడా ఔన్స్ బంగారం ధర 1.6 శాతానికి పైగా పెరిగి 4,700 డాలర్ల స్థాయిని తాకింది. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేందుకు అమెరికాను అనుమతించే వరకు యూరప్‌లోని ఎనిమిది దేశాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామంతో ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగి, వారు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం, వెండి వైపు మళ్లించారు. రాజకీయ అస్థిరత, అమెరికా ద్రవ్య విధానంపై నెలకొన్న సందేహాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా బంగారం ధరల పెరుగుదలకు దోహదపడ్డాయని మెహతా ఈక్విటీస్ ఉపాధ్యక్షుడు రాహుల్ కలాంత్రి తెలిపారు. సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ వంటి రంగాల్లో వెండికి పెరుగుతున్న డిమాండ్ కూడా దాని ధరల పెరుగుదలకు కారణమవుతోంది. డాలర్ ఇండెక్స్‌లోని ఒడుదొడుకులు, సుంకాలపై యూఎస్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ వారం కూడా బులియన్ మార్కెట్ లో ఒడుదొడుకులు

## యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబానికి
# అపురూపమైన కానుకలు ఇచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ: భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఘన స్వాగతం పలికారు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి, ఢిల్లీ విమానాశ్రయానికి స్వయంగా వెళ్లి ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రయాణించడం వారి మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రధాని మోదీ భారతీయ సంస్కృతి, నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేక కానుకలను అందజేశారు. గుజరాతీ కుటుంబాల్లో తరతరాలుగా బంధాలకు కేంద్రంగా ఉండే, చేతితో చెక్కిన అందమైన చెక్క ఉయ్యాల (ఝూలా)ను బహూకరించారు. యూఏఈ 2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పాటు, కశ్మీర్‌కు చెందిన సుప్రసిద్ధ పష్మీనా శాలువాను తెలంగాణలో తయారైన వెండి పెట్టెలో పెట్టి అందజేశారు. "నా సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. బలమైన భారత్ యూఏఈ స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన తెలియజేస్తోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. యూఏఈ అధ్యక్షుడి తల్లి షేఖా ఫాతిమాకు కూడా పష్మీనా శాలువాతో పాటు, వెండి పెట్టెలో కశ్మీరీ కుంకుమపువ్వును బహూకరించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగాల్లో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ పర్యటన ద్వారా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రాంతీయ,




అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. గత దశాబ్ద కాలంలో యూఏఈ అధ్యక్షుడు భారత్‌లో పర్యటించడం ఇది ఐదోసారి కావడం గమనార్హం.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...
# మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు

ఛత్తీస్ గఢ్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉత్తర పశ్చిమ ప్రాంతంలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. భోపాలపట్నం ఫర్సేగఢ్ సరిహద్దుల్లోని అటవీ, కొండ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ ఇంచార్జ్ డీవీసీఎం దిలీప్ బెండ్జా సహా మొత్తం ఆరు మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మావోయిస్టుల కదలికలపై అందిన నమ్మకమైన సమాచారంతో డీఆర్‌జీ బీజాపూర్, డీఆర్‌జీ దంతేవాడ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు (202, 206, 210 బెటాలియన్లు), సీఆర్‌పీఎఫ్ 214 బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాలు ఈనెల 17న ప్రత్యేక సర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో జనవరి 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి. మృతులను దిలీప్ బెంజా (రివార్డు రూ.8 లక్షలు), మాధవి కోసా (రూ.5 లక్షలు), పాలో పోడియం (రూ.5 లక్షలు), లఖీ మద్కం (రూ.5 లక్షలు), జుగ్గో బంజం (రూ.2 లక్షలు), రాధా మెట్ట (రూ.2 లక్షలు)గా గుర్తించారు. వీరిపై మొత్తం రూ.27 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం తెలిపారు. కీలక నేత దిలీప్ బెంజాపై బీజాపూర్ జిల్లాలో 135 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనాస్థలంలో నుంచి రెండు ఏకే47లు, ఒక ఇన్సాస్, రెండు 0.303 రైఫిళ్లు, ఒక కార్బైన్‌తో పాటు పేలుడు పదార్థాలు, వైర్‌లెస్ సెట్లు, మావోయిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ బెండ్జాపై 135కు పైగా కేసులు నమోదై

# మేడారం మహా జాతరలో తప్పిపోతారనే భయం లేదిక..

(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : తెలంగాణా కుంభమేళాగా పేరు పొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలంగాణా సర్కార్ శతవిధాలా ప్రయత్నం చేస్తుంది. మంత్రి సీతక్క మేడారం మహా జాతర బాధ్యతను భుజాల మీద వేసుకుని మరీ పని చేస్తున్నారు. ఈసారి మేడారం జాతరలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని భావిస్తున్నారు. దీంతో మేడారం జాతర సకల హంగులతో కొత్త రూపు సంతరించుకోబోతుంది.




* **మేడారం మహా జాతరకు కమాండ్ కంట్రోల్ రూమ్**

జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహోత్సవం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (AI) ఆధారిత వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. ఇక తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి, జాతరలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు.

* **టీజీ క్వెస్ట్ అత్యాధునిక డ్రోన్ వ్యవస్థ 'మేడారం**

2.0'లో భాగంగా మేడారం జాతరలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ఎవరూ తప్పిపోకుండా ప్రజలందరికీ సురక్షిత జాతర అనుభవం కలిగించేలా జాతర భద్రతను పర్యవేక్షించేందుకు 'టీజీక్వెస్ట్' అనే అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థ ద్వారా 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీ రోడ్లపై ఈ డ్రోన్లు నిరంతరం నిఘా ఉంటాయి.

* **13 వేల మంది పోలీస్ సిబ్బంది సాంకేతిక నిఘాలో విధులు**

అవి మాత్రమే కాకుండా హీలియం బెలూన్లకు అమర్చిన పాన్ టిల్ట్ జూమ్ కెమెరాలు ఎత్తు నుంచి రద్దీని విశ్లేషిస్తాయి. తొక్కిసలాట జరిగే అవకాశమున్న ప్రాంతాలను ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేస్తాయి. దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది ఈ టెక్నాలజీ సర్వైలెన్స్ లో విధులు నిర్వహించనున్నారు. మేడారం జాతరలో చాలా పెద్ద సంఖ్యలో జనాలు వస్తారు కాబట్టి ఎక్కువ శాతం తప్పిపోయే అవకాశం ఉంటుంది.

* **జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్**

దాదాపు ఈసారి మూడు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న క్రమంలో జాతరకు వచ్చే భక్తులు ఎవరూ తప్పిపోకుండా చర్యలను చేపడుతున్నారు. గత జాతరలో దాదాపు 30 వేల మంది వరకు తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను తీసుకు వస్తున్నారు. వొడాఫోన్ ఐడియా సహకారంతో ఈ విధానం అందుబాటులో ఉంటుంది.

* **క్యూఆర్ కోడ్ గల జియో ట్యాగ్‌లతో తప్పిపోకుండా చర్యలు**

పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్లలో వృద్ధులు, పిల్లల వివరాలను నమోదు చేసి వారికి క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడతారు. దీంతో వారు ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్‌ను స్కాన్ చేయటం ద్వారా వారి పూర్తి వివరాలు తెలుస్తాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలో అమలు చేయటానికి అధికారులు రంగం సిద్ధం చేశారు.

* **శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు**

తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తమిళ భాషల్లోనూ వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. జాతరలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు పనిచేస్తున్నాయి. పాత నేరస్థుల గుర్తింపునకు ఆసుపత్రి ప్రాంగణాలు, పార్కింగ్ స్థలాల వద్ద 'ఫేస్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు.

# తిరుమలలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది. ఒక్కరోజులోనే స్వామివారి ఏడు వాహన సేవలను దర్శించుకునే అరుదైన అవకాశం లభించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు

# 270 ఏళ్ల తర్వాత పూర్తిస్తాయిలో కేరళ కుంభమేళా

కేరళలోని తిరునావాయలో నీల నది తీరంలో కేరళ కుంభమేళాగా పిలిచే మహా మాఘ మహోత్సవం ప్రారంభమైంది. ఈ మహోత్సవాన్ని రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ధర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ సనాతన సంప్రదాయాన్ని, హిందూ ఆచారాలను ప్రశంసించారు. సనాతన సంప్రదాయాన్ని పాటించడం అంటే మరెవరికో వ్యతిరేకం కాదని ఆయన అన్నారు. భారతదేశం అందరినీ తనలో కలుపుకుని ముందుకు సాగుతుందని అన్నారు. నీల నదిని భరతపూజ నది అని కూడా అంటారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మహా మాఘ మహోత్సవాన్ని సుమారు 270 సంవత్సరాల తర్వాత పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. చివరి పూర్తిస్థాయి మహా మాఘ మహోత్సవం 1755లో జరిగిందని రికార్డులు వెల్లడిస్తున్నాయి. నేడు ప్రారంభమైన ఈ మాఘ మహోత్సవం ఫిబ్రవరి 3 వరకు 15 రోజుల పాటు కొనసాగుతుంది. కేరళ, తమిళనాడుతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానమాచరిస్తారు. ఈసారి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. మాఘ మహోత్సవం సందర్భంగా కేరళ ఆర్టీసీ సుమారు 100 బస్సులను ఏర్పాటు చేసింది. ఈ పదిహేను రోజుల పాటు పాండిత్య చర్చలు, కలరిపయట్టు, యోగా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

# హిందువులపై దాడులు.. స్పందించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

బంగ్లాదేశ్ : తమ దేశంలో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. తమ దేశంలో మైనారిటీలకు సంబంధించిన ఘటనల్లో చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగిన వ్యక్తులు చేసినవేనని, వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవని తెలిపింది. మైనారిటీలకు సంబంధించి గత ఏడాది 645 ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్ కార్యాలయం వివరాలు వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలు ఉన్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు తెలిపింది. ఆ 71 ఘటనలకు సంబంధించి 50 అంశాల్లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది. మిగిలిన 21 ఘటనలపై తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొంది. నేరం ఏదైనా తీవ్రంగానే పరిగణిస్తున్నామని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ ప్రకటనను బంగ్లాదేశ్ హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ప్రకటనలు నేరస్థులను ప్రోత్సహించి, వారికి శిక్షపడదనే భావనను కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడు వారాల వ్యవధిలోనే 10 మందికి పైగా హిందువులు బంగ్లాదేశ్‌లో హత్యకు గురయ్యారు.

## వెంకన్న భక్తులకు తీపికబురు...
# ఇకపై అన్ని టీటీడీ ఆలయాల్లో ఉచితంగా అన్నప్రసాదం

శ్రీవారి భక్తులకు టీటీడీ తీపికబురు అందించారు. దేశంలోని అన్ని టీటీడీ ఆలయాల్లో భక్తుల కు ఉచితంగా అన్న ప్రసాదం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ తిరుమలలోనే అమలవుతున్న ఈ స్కీమ్‌ను దేశమంతా విస్తరించాలని భావించింది. ఈ మేరకు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆయా టీటీడీ ఆలయాల్లోనే రెండు పూటలు అన్న ప్రసాదం వితరణ చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.



ఈ చారిత్రక నిర్ణయాన్ని స్వయంగా టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు. తిరుపతి పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన మార్చి నెలాఖరు నుంచే అన్ని టీటీడీ ఆలయాల్లో ఉచిత అన్నప్రసాదం స్కీమ్‌ను అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించినట్లు అధికారులకు సూచించారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో టీటీడీకి కేటాయించిన స్థలాల్లో ఆలయాల నిర్మాణ పనులను సైతం ప్రారంభించాలని అధికారులకు ఈవో సింఘాల్ తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తునకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు (మంగళవారం) ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరు కావాలని సిట్ హరీశ్ రావుకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది. మాజీ మంత్రి ప్రస్తుతం సిద్దిపేట పర్యటనలో ఉన్నారు. ఆయన ఇంట్లో లేని సమయంలో సిట్ ఈ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చిన దర్యాప్తు బృందం వారిని విచారించింది.

# సూపర్ మ్యాక్స్ పరిశ్రమలో జరిగిన భారీ దొంగతనంపై సమగ్ర విచారణ జరిపాలి

* **సీఐటీయూ**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గత డిసెంబర్ నెలలో సూపర్ మ్యాక్స్ పరిశ్రమలో జరిగిన భారీ దొంగతనంపై సమగ్ర విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈ దేవదానం కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ లు అన్నారు. సిఐటియు మండల కమిటీ సమావేశం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సూపర్ మాక్స్ పరిశ్రమలో జరిగిన భారీ దొంగతనంలో పాతయాజమాన్యం మల్హోత్ర. పాత్ర పై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులను శిక్షించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత నెలలో సూపర్ మ్యాక్స్ పరిశ్రమలో భారీ దొంగతనం జరిగి దాదాపు 20 కోట్ల మిషనరీని దొంగిలించడం జరిగిందని దాని దర్యాప్తులో భాగంగా జీడిమెట్ల పోలీసులు మిషనరీని హిమాచల్ ప్రదేశ్ కు తరలించారని అక్కడ మిషనరీ ఉన్నట్టు గుర్తించి సీజ్ చేసి జీడిమెట్లకు తీసుకు వచ్చినట్టు చెప్పడం జరిగిందని ఇద్దరిని అరెస్టు చేసి మిగతా వారి కోసం గాలిస్తున్నామని అంటున్నారన్నారు. ఎన్సీయల్టీ ఆధీనంలో ఉన్నటువంటి కంపెనీలో ఇంత పెద్ద భారీ దొంగతనం జరగడం. ఎలాంటి పేపర్లు లేకుండా లారీలలో మిషనరీని హిమాచల్ ప్రదేశ్ వరకు తీసుకెళ్లడం. అంత ఈజీ కాదని. దీని వెనకాల పాతయాజమాన్యం మల్హోత్ర పాత్ర గురించి కూడా




లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్సీయల్టీ ఆధీనంలో పనిచేస్తున్నటువంటి సెక్యూరిటీ గార్డ్స్ ఉండగా వాళ్లకు తెలవకుండా లారీలకు లారీలు మిషనరీని తరలించుక పోవడం అంటే కచ్చితంగా కార్మికులకు అన్యాయం చేసే కుట్రగా సిఐటియు భావిస్తుందన్నారు. సూపర్ మాక్స్ కంపెనీ యూనియన్ నాయకులు జేఏసీగా ఏర్పడి కార్మికులకు న్యాయం చేయాలని మూడు సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతా ఉంటే ఎన్సీయాల్టి ఆధీనంలో ఉన్న కంపెనీలో కార్మికులకు రావాల్సిన వేతనాలు చెల్లించకుండా. నష్టపరిహారం ఇవ్వకుండా కంపెనీలో ఉన్నటువంటి మిషనరీని దొంగ చాటుగా పక్కా ప్లాన్ ప్రకారం వారాలు వారాలు కంపెనీలో మాకాం వేసి దొంగిలించి తీసుకుపోతుంటే. ఎన్సీయాల్టి అధికారులకు తెలియకుండా ఉందంటే ఆలోచించాలని. అన్నారు సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులకు న్యాయం జరిగే వరకు సిఐటియు నాయకత్వం అండగా ఉంటుందని అన్నారు

## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

**: ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి రవాణా, మట్కా, పేకాట, కోడి పందాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అరైవ్ - అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన పెంచాలని, పోక్సో కేసుల్లో త్వరిత శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## పదవులను బాధ్యతగా నిర్వహించాలి

* **బీఆర్ఎస్ నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ లకు సన్మానం**
* **గిర్కాటి నిరంజన్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామపంచాయతీలలో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను బాధ్యతగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రం బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ లకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. తమకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కిష్టయ్య, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, చిన్నం బాలరాజు, యాట యోగానందం, రిక్కల భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, తాడూరి పరమేష్, నూతన సర్పంచులు కాకి శ్రీలత సుందర్, సుర్వి మల్లేష్ గౌడ్, అన్యాలపు నరేష్, గుండెబోయిన శిరీష ఇస్తారు యాదవ్, సమ్మిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి, ఉప సర్పంచ్ లు సుర్కంటి శ్రీధర్ రెడ్డి, బోయిని లింగస్వామి యాదవ్, కందగట్ల సురేందర్ రెడ్డి, కరంటోతు నరసింహ, మండల నాయకులు గంగాదేవి రమేష్ బాబు, ఉపేందర్ గౌడ్, కత్తుల సాయికుమార్, పబ్బతి వెంకటయ్య, బోరెం ప్రకాష్ రెడ్డి, కడగంచి చలమందరాజు, పబ్బతి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పాలనలో అగ్రదేశాల సరసన నిలుస్తోన్న భారత్

* **బూత్ స్థాయే బిజెపికి బలమైన పునాది**
* **బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, బూత్ నిర్మాణ్ అభియాన్ కన్వీనర్ శీలం రాజు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రధాని మోడీ పాలనలో అన్ని రంగాల్లో భారత్ అగ్రదేశాల సరసన నిలుస్తోందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, బూత్ నిర్మాణ్ అభియాన్ కన్వీనర్ శీలం రాజు అన్నారు. బిజెపి ముస్తాబాద్ మండల శాఖ అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ మల్లారపు సంతోష్ రెడ్డి, మండల కో కన్వీనర్ జిల్లెల్ల మల్లేశం అధ్యక్షతన బూత్ నిర్మాణ్ అభియాన్ మండల కార్యశాల సమావేశం ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై శీలం రాజు మాట్లాడుతూ బూత్ స్థాయే బిజెపికి బలమైన పునాదని అన్నారు. ప్రతి నాయకుడు ముందుగా తమ తమ బూత్‌లను పటిష్టం చేయాలన్నారు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని పిలుపునిచ్చారు. బలమైన బూత్‌లు బలమైన పార్టీని నిర్మిస్తాయని, ప్రతి బూత్ కమిటీ సమగ్ర ఓటరు డేటా, నిరంతర ప్రచారం, పోలింగ్ రోజుకు పూర్తి స్థాయి సంసిద్ధతను కలిగి ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో సంస్థాగత ప్రణాళికలను క్రమశిక్షణతో అమలు చేయడం ఎన్నికల విజయాన్ని, రాజకీయ బలాన్ని నిర్ణయిస్తుందని తెలిపారు. కార్యకర్తల అంకితభావమే పార్టీ విజయాలకు మూలాధారమని, ప్రతి వార్డు ప్రతి బూత్‌లో బలమైన నిర్మాణం అవసరమని, కేంద్ర ప్రభుత్వ అభివ ద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శులు ఎదునూరి గోపికృష్ణ, బుచ్చేలి మహేశ్వరీ, జిల్లా అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజగౌడ్, మొర్రాయిపల్లె సర్పంచ్ మెంగని శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు కోల కృష్ణ, వినోద్, గాడిచర్ల శ్రీనివాస్, వార్డుమెంబర్లు, బీజేవైఎం మండల అధ్యక్షులు కుడుకల జనార్ధన్, బీజేపీ మండల పదాధికారులు చీకోటి మహేష్, బెదుర ప్రశాంత్, వరి వెంకటేష్, కనకయ్య, చిట్టినేని శ్రీనివాస్ రావు, నర్ర ప్రశాంత్, బాధ నరేష్, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, పిరాళ్ల విజయ్, సిలివెరీ స్వామి, చందు, మోహన్ నాయక్, మహేష్, రవి, అనిల్ తదితరులున్నారు.

## కలెక్టర్ సారు న్యాయం చేయండి

* **వారసత్వ భూమి కోసం పాసిలు పోరాటం**
* **ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితంలేదని వాపోతున్న వైనం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వారసత్వంగా వచ్చిన భూమికి హక్కు కల్పించాల్సిందిపోయి... అటవీశాఖ భూమి అని పేర్కొంటూ అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోతున్నారు పాసిలు. ఇల్లందు మండలం తిలక్‌నగర్‌కు చెందిన పాసిలు అయిన రంజిత్ కుమార్ తాత గయ ప్రసాద్‌కు అదే మండలంలోని రొంపేడు రెవెన్యూ గ్రామ పరిధిలో సుమారు 10 ఎకరాల వ్యవసాయ భూమి కలదు. తాతల కాలం నాటి నుండి వారు ఆ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూమికి సంబంధించి భూ భారతి పోర్టల్‌లో కూడా గయ ప్రసాద్ పేరు చూపిస్తోంది. ప్రభుత్వ రికార్డులలోనూ అతని పేరు నమోదు కాబడి ఉంది. అయితే ఇటీవల అటవీ శాఖాధికారులు సంబంధిత భూమి తమ శాఖకు చెందినది అంటూ స్వాధీనపర్చుకునే ప్రయత్నం చేశారని రంజిత్ కుమార్ ఆరోపిస్తున్నారు. తమ కుటుంబం ఆ యొక్క భూమిలోనే సాగు చేసుకుంటూ, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, కాని అటవీ శాఖాధికారులు తమ శాఖ పరిధిలోని భూమి అని చెప్తున్నారని పాసిలు వాపోతున్నారు. ప్రభుత్వ రికార్డుల్లోనూ తమ తాత పేరు నమోదు కాబడి ఉందని, గతంలోనూ వారసత్వం కింద ఆ భూమి మా పేరుకు మార్చాలని విజ్ఞప్తులు చేశామని అంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదని, అటవీ అధికారులు తమ భూమిలో సాగు చేయనివ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు విన్నవించినట్లు చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు సైతం మెమోరాండం అందించామని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వారసత్వంగా వచ్చిన భూమిని మాకు తిరిగి ఇప్పించాలని కోరుచున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కలిసివచ్చే లౌకిక శక్తులతో సిపిఎం పార్టీ పోటీ




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో కలిసివచ్చే లౌకిక శక్తులతో సిపిఎం పార్టీ పోటీకి సిద్ధమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని సిపిఎం పార్టీ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ కార్యదర్శి వర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ పాషా మాట్లాడుతూ గతంలో సిపిఎం పార్టీ గా చౌటుప్పల్ మున్సిపాలిటీలో సర్పంచ్, ఎంపీటీసీలుగా గెలిచి అభివృద్ధి చేసినటువంటి పనులు మాత్రమే ఉన్నాయని ఆరోపించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులు గెలిపిస్తే ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్లో పోరాటం చేస్తారని హామీ ఇచ్చారు. వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గంపై ఒత్తిడి తీసుకువచ్చి, వార్డుల అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతుకలకు పట్టం కట్టాలని సూచించారు. సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ అవినీతి లేకుండా సుపరిపాలన అందిస్తామన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో 20వార్డుల్లో శాఖలు ఏర్పడి ఉన్నాయని, కలిసి వచ్చే లౌకిక శక్తులతో 20వార్డుల్లో కలిసి పోటీ చేస్తామన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గతంలో చౌటుప్పల్ లో వరదలు వచ్చి చెరువు, నీటితో చౌటుప్పల్ కొంత భాగం మునిగినప్పుడు ప్రజలకు అండదండగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టాలు కలుగకుండా కాపాడిన చరిత్ర ప్రజాప్రతినిధులుగా మాకు దక్కిందన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారి రామేశ్వరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో సిపిఎం సర్పంచ్ గా జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత అదేవిధంగా ఎన్నికైన కౌన్సిలర్లు నీతిగా, నిజాయితీగా, పాలన కొనసాగించారని గుర్తు చేశారు. మున్సిపల్ కార్యదర్శివర్గ సభ్యులు దండ అరుణ్ కుమార్, అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిఎంపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నరసింహ, సిపిఎం పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ గోపగోని లక్ష్మణ్, సిఐటియు నాయకులు బత్తుల దాసు, రైతు సంఘం నాయకులు ఆకుల ధర్మయ్య, ఉష్కాగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సహాయం అందించడమే ఇ ఎల్ వి ఫౌండేషన్ లక్ష్యం

* **మల్లికార్జున నగర్ కాలనీలో బోరుబావి ఏర్పాటు**
* **ఇ ఎల్ వి ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పేద ప్రజల అవసరాలను గుర్తించి వారికి సహాయం అందించడమే ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ లక్ష్యమని ఇ ఎల్ వి ఫౌండేషన్ డైరెక్టర్ ఇరగదిండ్ల అశోక్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం మల్లికార్జున నగర్ కాలనీలోని మందుల కుల సంక్షేమ సంఘం విన్నపం మేరకు ఫౌండేషన్ చైర్మన్ ఇ.ఎల్. వి. భాస్కర్ ఫౌండేషన్ ఆదేశానుసారం సోమవారం ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ పూజా కార్యక్రమాలు నిర్వహించి, బోరు బావి పనులను ప్రారంభించారు. కాగా తక్షణమే స్పందించి బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరించినందుకు మందుల కుల సంక్షేమ సంఘం నాయకులు,స్థానిక ప్రజలు ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. నిస్వార్థంగా సేవ చేస్తున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ఫౌండేషన్ తరపున తమ వంతు అండగా ఉంటామన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **వడ్డీ లేని రుణాలు పంపిణీ**
- **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బి ఆర్ కె ఫంక్షన్ హాల్ లో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హాజరయ్యారు. గత రెండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 591మహిళ సంఘాలకు రూ.1,28,11,337ల విలువైన చెక్కును మహిళా లింగాల సభ్యులకు అందజేశారు. వివిధ పథకాల ద్వారా వివిధ బ్యాంకుల నుంచి 451సంఘాలకు గాను రూ.33,25,00,000ల రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ మహిళా అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళలు ఋణాలు తీసుకొని స్వయం ఉపాధి ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, డైరెక్టర్ చప్పిడి సంజీవరెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, డి అంజయ్య, హనుమాన్ ప్రసాద్, టీఎంసీ కవిత, ఆర్పీలు శోభన, జ్యోతి, హైమావతి, లావణ్య, కవిత, రమాదేవి, లక్ష్మి, కల్పన, నర్మద, హేమలత, సుగుణ, బాలమణి, మల్లమ్మ, రజిత, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం...

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామాల సమగ్ర అభివృద్ధిలో గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్స్టిట్యూట్ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో నూతనంగా ఎన్నికైన సర్పంచుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, జిల్లాలోని 471



మంది సర్పంచులకు విడతల వారీగా శిక్షణలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి విడతలో 14 మండలాలకు చెందిన 237 మంది సర్పంచులు పాల్గొన్నారు.శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టం, గ్రామ పాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సర్పంచుల బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల పర్యవేక్షణ, అక్షరాస్యత పెంపు, సామాజిక భద్రత పథకాల ప్రచారం చేయాలని కోరారు. గ్రామాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి ఆర్థిక ప్రగతి సాధించవచ్చని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా సర్పంచులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ అండ

*** ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇరుగదిండ్ల అశోక్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులో నూతనంగా నిర్మించిన మోక్ష లింగేశ్వర స్వామి శివాలయాన్ని సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అడగగానే షెడ్డు నిర్మించేందుకు ముందుకు వచ్చిన ఇ ఎల్ వి ఫౌండేషన్ ను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఇ ఎల్ వి ఫౌండేషన్ కేవలం ఆధ్యాత్మిక రంగంలోనే కాకుండా, విద్యా, వైద్య, ఉపాధి రంగాల్లో కూడా పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. దైవ కార్యాల్లో భాగస్వాములు కావడం వల్ల లభించే తృప్తి మరెక్కడా దొరకదన్నారు.

## ఖమ్మం రేంజ్‌కు 'బెస్ట్ పెర్ఫార్మెన్స్' అవార్డు

*** ఏసిబి డీఎస్పీ వై. రమేష్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పనితీరు సమీక్షలో ఖమ్మం రేంజ్ మెరుగైన ఫలితాలు సాధించడంతో ఖమ్మం ఏసిబి డీఎస్పీ వై. రమేష్‌కు 'ఉత్తమ పనితీరు – బెస్ట్ పెర్ఫార్మెన్స్' అవార్డు లభించింది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏసిబి డైరెక్టర్ జనరల్ చారు సిన్హా చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఖమ్మం రేంజ్ పరిధిలో అవినీతి నిరోధక చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో డీఎస్పీ వై. రమేష్ చూపిన నాయకత్వం, పటిష్ట దర్యాప్తు, ప్రజల విశ్వాసం పెంపొందించే చర్యలను గుర్తించి ఈ పురస్కారం అందజేశారు.


## ప్రజా సమస్యలను పరిష్కరించాలని వినతి




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లో గల పలు వీధులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గాంధీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. సోమవారం గాంధీనగర్ లోని చింతల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఉప కమిషనర్ లావణ్య కు వారు వినతిపత్రం అందజేశారు.ఆయా ప్రాంతాలను త్వరలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సంక్షేమ సంఘం నాయకులు జల్దా లక్ష్మీనాద్,శ్రీధర్, తిమ్మయ్య,పర్వతాలు,ఆనంద్ లు కలిసిన వారిలో ఉన్నారు.

## చింతల్ సర్కిల్ కార్యాలయాన్ని మరోచోటికి తరలించాలి

*** తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ కు వినతి**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బడుగు బలహీన వర్గాలు నివసించే గాంధీనగర్ లో కమిటీ హాల్ అందుబాటులో ఉండేలా చూడాలని సోమవారం ఖైరతాబాద్ లోని బీసీ కమిషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ ను స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్ తోపాటు సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ నగర్ లో ఉన్న కమిటీ హాల్ లో చింతల్ సర్కిల్ కార్యాలయం మార్చడంతో కమిటీ హాల్ లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు చింతల్ సర్కిల్ కార్యాలయాన్ని మరోచోటికి తరలించాలని కోరారు ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు మేకల ఎల్లయ్య నవీన్ ఆనంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

*** శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**

మేడ్చల్ ప్రతినిధి , (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం లో 40 కోట్ల నిధులతో మూడు మున్సిపాలిటీలలో ఎల్లంపేట మున్సిపాలిటీలో 9 కోట్ల 43 లక్షల నిధులతో, అలియాబాద్ లో 15 కోట్ల నిధులతో, మూడు చింతలపల్లి లో 15 కోట్ల నిధులతో శంకుస్థాపనలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయనతో పాటు ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలు, మైనార్టీలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మేడ్చెల్ జిల్లాలో రూ. 45 లక్షల నిధులతో 900 మంది మైనారిటీ నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసామన్నారు. గతంలో అలియాబాద్ మున్సిపల్ పరిధి మహిళలకు రెండు కోట్ల 33 లక్షల వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. రానున్న మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు తమకు అందిస్తున్న రిజర్వేషన్ కోటాలో పోటీ చేసి రాజకీయ పదవులను కూడా అధిష్టించాలని ఆకాంక్షించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ నిర్మించిన మూడు చింతలపల్లి ఎమ్మార్వో కార్యాలయ నూతన భవనాన్ని, మేడ్చల్ మండల తాసిల్దార్ & జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ప్రారంభించారు. అలియాబాద్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఇంద్రమ్మ శ్రీ శక్తి సంఘాల 18506 మంది మహిళలకు ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి చీరల పంపిణీ చేశారు. అలియాబాదులో 5258, ఎంసీ పల్లిలో 6592, ఎల్లంపల్లిలో 6656 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్ డి ఓ రాజేష్, డిప్యూటీ కలెక్టర్ మోక్షిత, మూడు చింతలపల్లి ఎం ఆర్ ఓ ఇద్రీస్ మేడ్చల్ ఎం ఆర్ ఓ భూపాల్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, జిల్లా డి ఆర్ డి ఓ సాంబశివరావు, సంబంధిత మున్సిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.



## కాలనీ వాసులందరి సమిష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతా

*** అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి , ప్రజాస్ఫూర్తి : కాలనీ వాసులందరి సమిష్టి కృషి తో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ దత్తాత్రయ కాలనీ లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు , కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాలను కాలనీ వాసులు కార్పొరేటర్ కి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దత్తాత్రయ కాలనీలో దాదాపు తొంబై శాతం అభివృద్ధి పనులు పూర్తైనట్లు కాలనీ వాసులే చెప్పడం సంతోషంచదగ్గ విషయం అని అన్నారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అనిఅన్నారు. దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్లు, డ్రైనేజీ, త్రాగు నీరు, వీధి దీపాలు, పారిశుద్యం వంటి పెండింగ్ ఉన్న సమస్యలను శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. అదేవిధంగా కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధి లో భాగస్వాములు కావాలన్నారు. కాలనీలోని ఒక గల్లీలో మంజీరా నీటిలో డ్రైనేజీ నీరు కలిసి త్రాగునీరు కలుషితం అవ్వుతుందని కాలనీ మహిళలు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకురగా కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యను త్వరలో పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, గోపాల్, జగదీష్, సత్యనారాయణ, వెంకటేష్ గౌడ్, వీరేషం, అశోక్, నాగభూషణం, కృపాకర్ గౌడ్, లింగం, సత్తయ్య, ఎమ్.డి మోసిన్, హరి, శ్రీకాంత్, లక్ష్మణ్ రావు, రామకృష్ణ, యాదగిరి. జి.ఎచ్.ఎమ్.సి అధికారులు వాటర్ వర్క్స్ మేనేజర్ ఝూన్సీ, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి మున్సిపల్ వార్డ్ ఆఫీసర్స్ కన్వీనర్ గా ముత్యాల క్రాంతి కుమార్



బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ సర్కిల్ నుండి రాష్ట్ర స్థాయి మున్సిపల్ వార్డ్ ఆఫీసర్స్ కన్వీనర్ గా నియమితులైన వార్డ్ ఆఫీసర్ ముత్యాల క్రాంతి కుమార్ కి బోడుప్పల్ సర్కిల్ వార్డ్ ఆఫీసర్స్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కన్వీనర్ ఎం. క్రాంతి కుమార్ వార్డ్ ఆఫీసర్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలమైన ఫలితాలను సాధిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ సర్కిల్ కి సంబంధించిన 40 మంది వార్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.


## భగత్ సింగ్ నగర్ లో ప్రజల సమస్యలను పరిష్కరించాలి

*** భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్ లోని పలు వీధులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్,గాంధీనగర్ లోని చింతల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్లు,భూగర్భ డ్రైనేజీ పనుల తోపాటు,పలు సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని తక్షణమే పరిష్కరించాలన్నారు. దీంతో స్పందించిన డిసి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని వారికి తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్,సుంకరి ప్రతాప్ రెడ్డి,ఉపాధ్యక్షులు బీసు వెంకటేశం గౌడ్, కమిటీ సభ్యులు, పెద్దలు రాఘవులు, సహదేవ్, వెంకటరెడ్డి, శ్రీధర్ గౌడ్, రాము, శివ పాటిల్, మల్లేశం, ప్రవీణ్ కుమార్ గౌడ్ , ఇస్మాయిల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22 నుంచి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి 55వ బ్రహ్మోత్సవాలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు , కలియుగ ఇష్టదైవం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి 55వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆలయ ఈఓ కృష్ణామాచార్యులు తెలిపారు. 22న సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, స్వస్తీ పుణ్యాహ వాచనం, రక్షా బంధనం, వేదపారాయణం, అరగింపు, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి 10 గంటలకు ద్వార బంధనం జరుగుతుందన్నారు. 23న వసంత పంచమి సందర్భంగా ఉదయం 6 గంటలకు ప్రాభోదిక, వేద పారాయణం, ఉదయం 7 గంటలకు అభిషేకం, ఉదయం 9:30 గంటలకు హవనం, 10:30 గంటలకు ధ్వజారొహణం, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారి తిరు కళ్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. అనంతరం శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయ కమిటీ ఆర్యవైశ్య సంఘం వారిచే అన్నదానం, రాత్రి 10 గంటలకు ద్వారా బంధనం, 24న ధ్వజ పట కంకణోద్వాసన, పండిత సన్మానం, సాయంత్రం 4 గంటలకు శ్రీ వారి పల్లకి సేవ, గ్రామోత్సవం, (ఉరేగింపు) రాత్రి 10 గంటలకు ద్వార బంధనం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# నిమ్స్‌లో స్టెమ్ సెల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్

హైదరాబాద్: పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ లక్ష్యంలో భాగంగానే నిమ్స్‌లో స్టెమ్ సెల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టెమ్ సెల్ ల్యాబ్‌ను మంత్రి దామోదర ప్రారంభించారు. విత్తనం నుంచి మహా వృక్షం తయారు అయినట్టే.. స్టెమ్ సెల్స్ నుంచి కొత్త కణాలను, అవయవాలను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. మన శరీరంలో ఏదైనా భాగం దెబ్బతిన్నప్పుడు లేదా జబ్బు చేసినప్పుడు, ఆ భాగాన్ని రిపేర్ చేసే అద్భుతమైన శక్తి ఈ కణాలకు ఉంటుందని మంత్రి రాజనర్సింహ వెల్లడించారు. మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా నయం చేయగలిగే శక్తి వీటికి ఉంటుందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి జబ్బులతో బాధపడేవారికి ఈ చికిత్స సంజీవని లాంటిదని మంత్రి అన్నారు. ఆయా వ్యాధుల వల్ల శరీరంలో దెబ్బతిన్న కణజాలాన్ని మళ్లీ కొత్తగా సృష్టించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందని వివరించారు. ప్రస్తుతం స్టెమ్ సెల్ చికిత్స కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే అందుబాటులో ఉందని, అది కూడా రూ. లక్షల ఖర్చుతో కూడుకొని ఉంటుందని తెలిపారు. సామాన్య ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో ప్రధానంగా స్టెమ్ సెల్స్‌పై లోతైన పరిశోధనలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం తరఫున ఎలాంటి సహకారమైనా అందిస్తామని తెలిపారు. తులసి థెరప్యుటిక్స్, నిమ్స్ డాక్టర్లు పరిశోధనలు చేస్తారని మంత్రి వివరించారు. ఈ పరిశోధనల ఫలితంగా, భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేద రోగులకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగలుగుతామన్నారు. త్వరలోనే ఈ ల్యాబ్ పరిశోధనా ఫలాలు ప్రజలకు అందుతాయని ఆశిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



## రాజకీయ కక్ష సాధింపులే కాంగ్రెస్ అజెండా

**: కేటీఆర్**



హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్ రావు కు సిట్ నోటీసులు జారీ చేయడంపై భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. రాజకీయ వేధింపులే కాంగ్రెస్ ఏకైక అజెండాగా మారిందంటూ ధ్వజమెత్తారు. "ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు అని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా కేసును కూడా కొట్టేసింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతోనే ఈ డ్రామా ముగిసినా, మళ్లీ హరీశ్‌రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ ఎంత దిగజారిందో అర్థమవుతోంది. హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెడుతున్నారు. దారుణ పాలనను నిలదీస్తున్నందుకే కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. మాకు చట్టం, కోర్టులపై గౌరవం ఉంది.. ఏ విచారణకైనా సిద్ధం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం. చౌకబారు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు" అని పేర్కొన్నారు.

## HYDలో సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి భారీ శుభవార్త

సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలనుకుంటున్న వారికి తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్ మహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా తొర్రూర్, కుర్మల్ గుడ, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్ పల్లి ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి చెంది మౌలిక వసతులతో ఉన్న ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం తెలిపారు. ఆయా ప్రాంతాలను బట్టి బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరల్లోనే చదరపు గజానికి రూ.20 వేల నుంచి 30 వేల వరకు అప్ సెట్ ప్రైస్ తో ఈ ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

**వివాదాలు లేని క్లియర్ ప్లాట్స్**

తమ ఆకాంక్షలు, అభిరుచులకు అనుగుణంగా సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలనుకుంటున్న వారికి ఈ ప్లాట్లు చాలా అనుకూలంగా ఉంటాయని ఎండీ గౌతం తెలిపారు. మంచి కనెక్టివిటీతో ఎటువంటి వివాదాలు లేని క్లియర్ టైటిల్, ప్రభుత్వ యంత్రాంగమే ఈ లేవుట్లను అభివృద్ధి చేయడం, కొనుగోలు చేసిన వెంటనే భవన నిర్మాణాలను



చేపట్టేందుకు వీలుగా ఉన్న ఈ ప్లాట్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్లాట్ల కొనుగోలుకు గతంలో పెద్ద ఎత్తున స్పందన రావడంతో మరోసారి ప్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. వీటి కొనుగోలుపై ఆసక్తి ఉన్నవారు మీసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, డీడీ చెల్లించాలని పేర్కొన్నారు. ఓఆర్ఆర్ఆదిభట్ల, ఐటీ కారిడార్‌కు సమీపంలోని తొర్రూర్ లే అవుట్‌లోని ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 వ తేదీన, ఓఆర్ ఆర్ సమీపంలోని బహదూర్ పల్లి, శంషాబాద్ ఎయిర్ పోర్టుకు దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ ప్రాంతాల్లోని ప్లాట్లకు ఫిబ్రవరి 8 వ తేదీ మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.swagruha.telangana.gov.inవెబ్ సైట్‌లో చూడవచ్చని వివరించారు. మరే ఇతర సమాచారం కావాలన్న ఈ ఫోన్ నెంబర్లు 8121022230 (తొర్రూర్), 8347472106 (బహదూర్ పల్లి),7993455802 (కుర్మల్ గుడ) లలో సంప్రదించవచ్చు.

**అందుబాటులోని ప్లాట్లు :**

తొర్రూర్ - 105 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. చదరపు గజానికి కనీస ధర (అప్ సెట్ ప్రైస్) రూ. 25 వేలు కాగా ఇవి 200 500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.

బహదూర్ పల్లి - 12 ప్లాట్లు ఉన్నాయి. 200 1000 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ లేవుట్‌లోని కార్నల్ ప్లాట్‌కు చదరపు గజానికి కనీస ధర రూ.30 వేలుగాను, ఇతర ప్లాట్లకు రూ.27 వేలుగా నిర్ధారించారు. కుర్మల్ గుడ - 20 ప్లాట్లు 200300 చ.గజాల విస్తీర్ణంలో ఉండగా చదరపు గజానికి రూ.20 వేలు కనీస ధరగా నిర్ధారించి బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నారు.

**దరఖాస్తుకు ఆఖరు తేదీలు :**

తొర్రూర్ ప్రాంతంలోని ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపే వారు రూ. 2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 6 తేదీ లోగా, బహదూర్ పల్లిలోని ప్లాట్లకు రూ. 3 లక్షలు, కుర్మల్ గుడ లోని ప్లాట్లకు రూ.2 లక్షలతో ఫిబ్రవరి 7 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

## మీ వెహికల్ ఓవర్ స్పీడ్..

## ఏకంగా డీసీపీకే కేటుగాళ్ల సందేశాలు!

హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు ఏకంగా ఓ పోలీసు ఉన్నతాధికారికే సందేశాలు పంపించారు. మీ వాహనం ఓవర్ స్పీడ్‌గా వెళ్లడం కెమెరా గుర్తించిందని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లికి కేటుగాళ్లు మెసేజ్‌లు పెట్టారు. మూడు రోజుల్లో రెండు సార్లు ఇలా సందేశాలు పంపారు. చలాన్లు చూడాలంటే తాము పంపించిన లిక్ క్లిక్ చేయాలని సూచించారు. చివర్లో ట్రాఫిక్ నియమాలు పాటించండి.. అని కూడా ఆ సందేశంలో పేర్కొనడం గమనార్హం. అయితే.. ఆ లింక్‌ను క్లిక్ చేయకుండా 'సంచార్‌సాథి'లో డీసీపీ ఫిర్యాదు చేశారు. ప్రజలు ఇలాంటి లింక్స్‌పై అప్రమత్తంగా ఉండాలని 'ఎక్స్' ద్వారా కోరారు.



## నాకు చాలా గర్వంగా ఉంది: సజ్జనార్

సైబర్ నేర బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చేపట్టిన వినూత్న కార్యక్రమం 'సీమిత్ర' సత్ఫలితాలను ఇస్తోందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 'దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ విధానం.. అమల్లోకి వచ్చిన కేవలం పది రోజుల్లోనే వందల మందికి భరోసానిచ్చింది. ఈ స్వల్ప వ్యవధిలో సీమిత్ర బృందం 1000 మంది బాధితులకు స్వయంగా ఫోన్ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. రోజుకు సగటున 100 ఫోన్ కాల్స్ చేస్తున్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 200 మందికి పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్ట్‌లను సిద్ధం చేసి పంపింది. వారి నుంచి సంతకం చేసిన ప్రతులు అందగానే.. ఎక్కడా జాప్యం లేకుండా 100 కిపైగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. గంటల తరబడి స్టేషన్లలో పనిలేకుండా, నిమిషాల్లోనే వర్చువల్ పోలీసులు స్పందిస్తుండటం, ఎఫ్ఐఆర్ కాపీలు నేరుగా మొబైల్‌కే వస్తుండటంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

*** ఇంటి నుంచే ఫిర్యాదు.. ఫోన్‌కు ఎఫ్ఐఆర్ కాపీ**

సైబర్ నేర బాధితులు 1930 నంబరుకు లేదా జాతీయ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే 'సీమిత్ర' బృందం రంగంలోకి దిగుతుంది. బాధితులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీసి, ఏఐ సాంకేతికతతో లీగల్ అంశాలతో కూడిన పక్కా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి వాట్సాప్ లేదా మెయిల్‌కు పంపిస్తారు. బాధితులు ఆ ఫిర్యాదును ప్రింట్ తీసుకొని, సంతకం చేసి బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు కొరియర్ లేదా పోస్ట్ ద్వారా పంపాలి. ఆ కాపీ అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్




నమోదు చేసి, ఆ వివరాలను బాధితుల మొబైల్‌కే మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. సీమిత్ర సేవలను వేగంగా బాధితులకు అందించేందుకు 24 మందితో కూడిన ప్రత్యేక బృందాన్ని సైబర్ క్రైం విభాగం ఏర్పాటు చేసింది. రెండు షిఫ్ట్‌ల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ 'వర్చువల్ హెల్ప్‌డెస్క్' బాధితులకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ నేర బాధితులకు ఇబ్బందులు కలగకుండా సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమం సీమిత్రను జనవరి 9వ తేదీన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రారంభించారు.

*** పోలీసులా కాదు.. ఒక సోదరిలా!: దీక్షిత, మహిళా కానిస్టేబుల్**

సాధారణంగా మోసపోయామన్న బాధలో ఉన్నవారు పోలీస్ స్టేషన్‌కు రావాలంటేనే భయపడతారు. కానీ, మేమే స్వయంగా ఫోన్ చేసి.. 'భయపడకండి, మీకు న్యాయం చేయడానికి మేమున్నాం' అని చెప్పగానే వారి గొంతులో కనిపించే ధైర్యం వెలకట్టలేనిది. ఒకప్పుడు స్టేషన్‌కు రావాలంటే ఆలోచించే సామాన్యుడికి, పోలీసులకు మధ్య 'సీమిత్ర' ఒక బలమైన వారధిలా నిలిచింది. నేను ప్రతి రోజు 20 మంది బాధితులకు ఫోన్ చేస్తా. ఒక సోదరిలా వారి సమస్యను విని, ఇంటి నుంచే ఫిర్యాదు తీసుకుంటున్నప్పుడు బాధితులు చూపిస్తున్న కృతజ్ఞత మా బాధ్యతను మరింత పెంచుతోంది.

*** భవిష్యత్తులో 'సీ-మిత్ర' బంద్ అవ్వాలన్నదే మా లక్ష్యం: పృథ్వీక, మహిళా కానిస్టేబుల్**

టెక్నాలజీని, మానవతా దృక్పథాన్ని జోడించి హైదరాబాద్ పోలీస్ సృష్టిస్తున్న ఈ 'డిజిటల్ విప్లవం'లో.. ప్రజలకు ఇంత వేగంగా సేవలందిస్తున్నందుకు నాకు చాలా గర్వంగా ఉంది. గతంలో సైబర్ మోసం జరిగితే.. ఫిర్యాదు ఎలా రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అని తెలియక బాధితులు సతమతమయ్యేవారు. కానీ 'సీమిత్ర'తో ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవు. బాధితుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఫోన్ చేసి వివరాలు అడగానే సానుకూలంగా స్పందించి.. అన్ని వివరాలు తెలియజేస్తున్నారు. భవిష్యత్ లో హైదరాబాద్‌లో ఒక్క సైబర్ బాధితుడు కూడా లేకుండా చేసి.. సీమిత్ర బంద్ అయ్యే విధంగా మేమంతా పనిచేస్తున్నాం.

## 2025 చివరి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో కేసులు: డీజీ చారు సిన్హా



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) గతేడాది పనితీరుపై ఏసీబీ డీజీ చారు సిన్హా సమీక్ష నిర్వహించారు. గత 14 ఏళ్లలో లేని విధంగా కేసుల నమోదు చేశామని వెల్లడించారు. 2025 చివరి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సిబ్బంది అప్రమత్తత, కృషిని అభినందనలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ.. అవినీతిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసం పొందేలా నైతిక విలువలతో పనిచేయాలని, కేసుల నాణ్యత.. సాక్ష్యాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. దర్యాప్తులో సాంకేతిక వినియోగం పెంచాలని డీజీ ఆదేశించారు.



## గ్రేటర్ హైదరాబాద్‌లో


## 137 ప్లాట్లను వేలం వేయనున్న రాజీవ్ స్వగృహ

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో 137 ప్లాట్లను రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ వేలం వేయనుంది. తొర్రూర్, బహదూర్‌పల్లి, కుర్మల్‌గుడలో 137 ఓపెన్ ప్లాట్లు వేలం వేయనున్నట్లు కార్పొరేషన్ ఎండీ గౌతం తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 7-8 తేదీల్లో బహిరంగ వేలం ఉండనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు www.swagruha.telangana.gov.in చూడలన్నారు.

## సీఎం మాటలు.. రాజకీయ విద్వేషాలు

## పెంచేలా ఉన్నాయి: దాసోజు శ్రవణ్

హైదరాబాద్: ఖమ్మం బహిరంగ సభలో కేసీఆర్, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్నాయని ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. రాజ్యాంగం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సీఎం వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సమాజంలో హింస, రాజకీయ విద్వేషాలు పెంచేలా మాట్లాడారని చెప్పారు. ఆయనపై సుమోటో



కేసులు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. వ్యాఖ్యలు ప్రచారం చేసిన సోషల్‌మీడియా, మీడియా సంస్థలపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు. మరోవైపు సీఎం వ్యాఖ్యలపై డీజీపీ కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. పార్టీ ఆదేశాల మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు.


# కశ్మీర్‌పై సూచనలు.. పోలండ్ మంత్రికి జైశంకర్ చురకలు

పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కీతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. కాగా గతేడాది అక్టోబర్‌లో పాక్ పర్యటనకు వెళ్లిన సమయంలో పోలండ్ విదేశాంగ మంత్రి జమ్మూకశ్మీర్‌పై చేసిన సూచనలపై జైశంకర్ ఆయనకు చురకలు అంటించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు కూడా ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో రాడోస్లావ్‌కు తెలుసని జైశంకర్ అన్నారు. దానిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే గానీ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి ఆజ్యం పోయకూడదని చురకలు అంటించారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను మాత్రమే లక్ష్యం చేసుకోవడం అన్యాయమన్నారు. భారత్ పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జైశంకర్ వ్యాఖ్యలపై రాడోస్లావ్ సికోర్స్కీ స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. పోలండ్ కూడా ఉగ్ర సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. కాగా గతేడాది పోలండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆ దేశ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.



## డ్రైవర్‌కు ₹10 కోట్ల లాటరీ..
# పేదింట వెల్లివిరిసిన ఆనందం

సిర్సా: రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబంలో లాటరీ టికెట్ ఆనందోత్సాహాలు నింపింది. దీంతో ఆ కుటుంబంలో, గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. మనలో ఒకడికి అదృష్టలక్ష్మి తలుపు తట్టిందంటూ సంబరాలు చేసుకుంటున్నారు హరియాణాలోని సిర్సా జిల్లా ముహమ్మద్‌పురియా గ్రామస్థులు. 35 ఏళ్ల పృథ్వీ సింగ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు, తండ్రి, సోదరుడు ఉన్నారు. భార్య సుమన్ రాణి పాఠశాలలో



ప్యూన్‌గా పనిచేస్తుండగా.. తండ్రి దేవీలాల్ డ్రైవర్‌గా చేస్తున్నారు. ఇటీవల పృథ్వీ రూ.500తో టికెట్ కొనుగోలు చేస్తే 'పంజాబ్ లోహ్రీ మకర సంక్రాంతి 2026 బంపర్ లాటరీ'లో మొదటి బహుమతిగా ₹10 కోట్లు వచ్చాయి. మూడో ప్రయత్నంలో ఈ అదృష్టం దక్కడంపై పృథ్వీ సంతోషం వ్యక్తంచేశాడు. లాటరీ రూపంలో వచ్చిన నగదును పిల్లల భవిష్యత్తు కోసం వినియోగిస్తానని చెప్పాడు. వచ్చిన డబ్బులతో లగ్జరీ కారు కొనుగోలు చేయాలని అనుకుంటున్నట్లు తన 'చిరు' కోరికను బయటపెట్టాడు పృథ్వీ ఆరేళ్ల కుమారుడు దక్ష్.

## 8 గంటలు దాటితే నో రిఫండ్..
# వందేభారత్ స్లీపర్ క్యాన్సిలేషన్ ఛార్జీలు ఇలా..

దేశంలో వందేభారత్ స్లీపర్ రైలు ఎట్టకేలకు పట్టాలెక్కింది. ఈ నేపథ్యంలో ఈ రైలు టికెట్లకు సంబంధించి రైల్వే మంత్రిత్వశాఖ కీలక ప్రకటన చేసింది. టికెట్ క్యాన్సిలేషన్ నిబంధనలను కఠినతరం చేసింది. సాధారణ రైళ్లతో పోలిస్తే ఈ రైలు టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీలు భిన్నంగా ఉంటాయి. సాధారణ రైళ్లలో చివరి 4 గంటల వరకు టికెట్ రద్దు చేసినా పాక్షికంగా టికెట్ డబ్బులు వెనక్కి వస్తాయి. వందేభారత్ స్లీపర్ రైలులో మాత్రం అలా కాదు. ప్రయాణానికి 8 గంటల కంటే తక్కువ సమయం ఉంటే టికెట్ రద్దు చేసినా ఒక్క రూపాయి కూడా వెనక్కి ఇవ్వరు. ఈ మేరకు రైల్వే పాసింజర్స్ రూల్స్, 2015ను సవరించారు.

*** వందేభారత్ స్లీపర్ క్యాన్సిలేషన్ ఛార్జీలు ఇలా..**

72 గంటల కంటే ముందు రద్దు చేస్తే టికెట్ ధరలో 25% కోత విధిస్తారు.
72 గంటల నుంచి 8 గంటల మధ్య టికెట్ ధరలో 50% కోత ఉంటుంది.
ప్రయాణానికి 8 గంటల కంటే తక్కువ ఉన్నప్పుడు టికెట్ రద్దు చేస్తే డబ్బులు వాపస్ రావు.

**సాధారణ రైళ్లలో**

సాధారణ ఎక్స్‌ప్రెస్ లేదా మెయిల్ రైళ్లలో టికెట్ ధరలు ఫ్లాట్‌గా ఉంటాయి. తరగతిని బట్టి క్యాన్సిలేషన్ ఛార్జీలు వర్తిస్తాయి. 4 గంటల ముందు వరకు టికెట్ రద్దు చేసినా కొంత నగదు వెనక్కి వస్తుంది.

*** ప్రయాణానికి 48 గంటల ముందు వరకు క్యాన్సిలేషన్ ఛార్జీలు ఇలా...**

ఏసీ ఫస్ట్/ఎగ్జిక్యూటివ్: రూ.240 + జీఎస్టీ
ఏసీ 2 టైర్: రూ. 200 + జీఎస్టీ
ఏసీ 3 టైర్/చైర్ కార్: రూ.180 + జీఎస్టీ
స్లీపర్: రూ.120
సెకండ్ క్లాస్: రూ.60

48 గంటల నుంచి 12 గంటల మధ్య టికెట్ రద్దు చేస్తే టికెట్ ధరలో 25శాతం కోత పడుతుంది.



12 గంటల నుంచి 4 గంటల మధ్య 50% కోత విధిస్తారు.
4 గంటల కంటే తక్కువ ఉంటే డబ్బులు వెనక్కి రావు.

*** వందేభారత్ స్లీపర్‌లో నో RAC**

వందేభారత్ స్లీపర్ రైలులో టికెట్ కన్ఫమ్ అయినవారికే ప్రయాణానికి అనుమతిస్తారు. ఆర్ఏసీ (RAC)కి ఇందులో చోటులేదు. అంటే వెయిటింగ్ లిస్ట్, పాక్షికంగా కన్ఫమ్ అయిన ప్రయాణికులను ఈ రైలులో ప్రయాణానికి అనుమతించరు. అడ్వాన్స్ రిజర్వేషన్ పిరియడ్ నుంచే (60 రోజుల ముందు నుంచి) అన్ని బెర్తులూ అందుబాటులో ఉంటాయి. ఇందులో మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది. ఇతర కోటాలకు చోటు లేదు. 45 ఏళ్లు పైబడిన మహిళలకు, 60 ఏళ్లు పైబడిన పురుషులకు సీట్ల అందుబాటును బట్టి లోయర్ బెర్తులను సిస్టమ్ ఆటోమేటిక్‌గా కేటాయిస్తుంది. 400 కిలోమీటర్ల కంటే తక్కువగా ఎంత దూరానికి ప్రయాణించినా కనీస టికెట్ ధర రూ.960 (థర్డ్ ఏసీకి) చెల్లించాల్సి ఉంటుంది.



# కరూర్ తొక్కిసలాట కేసు..
## సీబీఐ అభియోగపత్రంలో విజయ్ పేరు?

చెన్నై (ప్యారిస్): కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దాఖలు చేయనున్న అభియోగ పత్రంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ పేరును చేర్చనున్నట్లు సమాచారం. కరూర్ తొక్కిసలాట కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ.. ఈ కేసుతో సంబంధం ఉన్న వారందరినీ దిల్లీలో ఉన్న కార్యాలయానికి రప్పించి ప్రశ్నిస్తోన్న విషయం తెలిసిందే. ఈనెల 12న విజయ్‌ని సీబీఐ అధికారులు సుమారు 6 గంటల పాటు ప్రశ్నించారు. సోమవారం (జనవరి 19న) కూడా మరోసారి విజయ్‌ని దిల్లీలో ప్రశ్నించారు. కరూర్‌లో ప్రచారంలో భాగంగా వాహనంలో నిలుచొని మాట్లాడేటప్పుడు రద్దీని గమనించలేదా? తొక్కిసలాట సమయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తొక్కిసలాటలోనూ వాహనాన్ని ఎందుకు ముందుకు నడిపారు?.. తదితర ప్రశ్నలు విజయ్‌ను అడిగినట్లు తెలుస్తోంది. అందులో పలు ప్రశ్నలకు జవాబు ఇచ్చిన విజయ్.. మరికొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు గడువు కోరినట్లు సమాచారం. విజయ్ ఇచ్చిన కొన్ని సమాధానాలకు సీబీఐ అధికారులు ఆధారాలు సమర్పించాలని కోరినట్లు తెలుస్తోంది.

## ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసు..
# కుల్దీప్ సెంగర్‌కు దిల్లీ హైకోర్టులో చుక్కెదురు

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార ఘటనకు సంబంధించి బాధితురాలి తండ్రి 'కస్టడీ' మృతి కేసులో భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు దిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో పదేళ్ల శిక్షను నిలిపివేయాలంటూ దాఖలు చేసిన ఆయన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. శిక్ష విషయంలో ఉపశమనం కల్పించేందుకు సరైన కారణాలు లేవని జస్టిస్ రవీందర్ పేర్కొన్నారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేశారు. ఉన్నావ్ అత్యాచార కేసులో కుల్దీప్ సెంగర్ దోషిగా తేలి, జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఇటీవల ఈ శిక్షను నిలిపివేస్తూ.. దిల్లీ హైకోర్టు కీలక



ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు షరతులపై బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే.. ఈ తీర్పుపై సీబీఐ అధికారులు, బాధితురాలి తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో శిక్ష నిలిపివేతపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. కస్టడీ నుంచి విడుదల చేయొద్దని పోలీసు శాఖను ఆదేశించింది. 2017లో కుల్దీప్ సింగ్ సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడు. 2018 ఏప్రిల్‌లో ఆమె తండ్రి పోలీసు కస్టడీలో మృతి చెందాడు. ఆగస్టు 1, 2019న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీకి బదిలీ చేశారు. అత్యాచారం కేసులో జీవిత ఖైదు, బాధితురాలి తండ్రి మృతి కేసులో పదేళ్ల జైలు శిక్ష పడింది.

# ఆఫీస్‌లో రాసలీలలు..
## డీజీపీ ర్యాంకు అధికారి బాగోతం

డీజీపీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి తన కార్యాలయంలో మహిళలతో సన్నిహితంగా ఉన్న వీడియోలు బయటకు రావడంతో కర్ణాటకలో వివాదం చెలరేగింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోల్లో కర్ణాటక సీనియర్ పోలీసు అధికారి కె.రామచంద్రరావు తన కార్యాలయంలో పలువురు మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు కనిపిస్తోంది. డీజీపీ కార్యాలయంలోని సిబ్బంది ఈ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించినట్లు తెలుస్తోంది. విధి నిర్వహణ సమయంలో సీనియర్ అధికారి ఇలా ప్రవర్తించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి వెళ్లడంతో ఘటనపై దర్యాప్తు చేసి, వివరణ ఇవ్వాలని



సంబంధిత శాఖకు సూచించారు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన దృశ్యాలపై దర్యాప్తు కొనసాగుతోందని.. అవి నిజమని తేలితే సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలు నిజం కావని.. తన ఫొటోలను మార్ఫింగ్ చేశారని సీనియర్ పోలీసు అధికారి రామచంద్రరావు పేర్కొన్నారు. తనను ఉద్యోగం నుంచి తొలగించడానికి నా పైఅధికారులు ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని ఆరోపించారు. కాగా గతేడాది బంగారం అక్రమరవాణా కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావు కు రామచంద్రరావు సవతి తండ్రి. అప్పట్లో బంగారం అక్రమ రవాణా కేసులో ఆయన పేరు వాడుకునే విమానాశ్రయాల్లో రన్యారావు భద్రతా తనిఖీలను తప్పించుకునేదని ఆరోపణలు వచ్చాయి.

# కెమెరా ముందు మాట్లాడటానికి పిటిషన్లు వేయొద్దు

**: పిటిషనర్‌పై సీజేఐ ఆగ్రహం**

న్యాయ సంస్కరణలపై దాఖలైన పిటిషన్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తంచేశారు. దానిని విచారించేందుకు నిరాకరించారు. న్యాయసంస్కరణలను పర్యవేక్షించేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేయాలని కోరుతూ ఈ వ్యాజ్యం దాఖలైంది. అలాగే ప్రతి కేసు 12 నెలల్లో పరిష్కారం అయ్యేలా చూడాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై సీజేఐ స్పందిస్తూ.. "న్యాయసంస్కరణల అంశమైతే.. దానికోసం మేం ఎవరినీ కోర్టు వరకు రానివ్వం. మీరు ఈ దేశాన్ని మార్చాలని అనుకుంటున్నారా..? అందుకోసం పిటిషన్ వేయాల్సిన అవసరం లేదు. ఒక లేఖ రాసి నాకు పంపండి. మీ సలహాలు ఏవైనా సరే రాసివ్వండి. అవి సాధ్యమో, కాదో మేం పరిశీలిస్తాం. బయట నిలబడి కెమెరా ముందు మాట్లాడటానికి పిటిషన్లు వేయొద్దు. ఇక, ప్రతి



న్యాయస్థానం ఒక కేసులో 12 నెలల్లో తీర్పు చెప్పాలని మీరు కోరుతున్నారా..? మీకు అలాంటి కోర్టులు ఎన్ని కావాలి..? అవి ఎక్కడి నుంచి వస్తాయి..?" అని వ్యాఖ్యానించారు.

# ఆ టార్గెట్ రీచ్ అయ్యేవరకు.. జీతం తీసుకోనన్న కలెక్టర్

పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. ఓ కలెక్టర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పేదల కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలు వారికి అందేవరకు తాను జీతం తీసుకోనని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు తనతో పాటు అధికారులు అందరూ ఈ విషయంపై పూర్తిశ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో స్థానికంగా ఆయన గురించి చర్చ మొదలయ్యింది. ఆయనే రాజస్థాన్‌లోని రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ హసిజా. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం రూపొందించిన మూడు పథకాలను తన జిల్లాలోని ప్రజలందరికీ



అందేలా చర్యలు తీసుకుంటానని రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ పథకాల నుంచి జిల్లాలోని ప్రతిఒక్కరూ ప్రయోజనం పొందేవరకు తన జీతం వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.."మా జీతం 10 రోజులు ఆలస్యమైనా చాలా ఇబ్బందులు పడతాము. అదే పేదరికంలో మగ్గేవారు, వారి పిల్లల చదువులు, పనులు చేసుకోలేని వికలాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత బాధాకరంగా ఉంటుంది. పథకాల కోసం నమోదు చేసుకోవడానికి కూడా వాళ్లు అనేక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు వారికి ఎలాగైనా చేర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను" అని తెలిపారు. అధికారిక నివేదికల ప్రకారం.. రాజ్‌సమండ్ జిల్లాలో దాదాపు 30వేల మంది పేద ప్రజలు ఉన్నారు. వీరికోసం రాజస్థాన్ ప్రభుత్వం మూడు పథకాలను అందిస్తోంది.

# గ్లోబల్ సంకేతాల దెబ్బ...

సెన్సెక్స్, నిఫ్టీ పతనం

ప్రతికూల ప్రపంచ సంకేతాలతో నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

దిగ్గజ కంపెనీల ఫలితాల తర్వాత వెల్లువెత్తిన అమ్మకాలు

సెన్సెక్స్ 324, నిఫ్టీ 108 పాయింట్లు నష్టం

రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి

యూరప్ దేశాలపై ట్రంప్ వ్యాఖ్యలతో బలహీనపడ్డ సెంటిమెంట్




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. ప్రతికూల ప్రపంచ సంకేతాలు, కొన్ని దిగ్గజ కంపెనీల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 324.17 పాయింట్లు నష్టపోయి 83,246.18 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 108.85 పాయింట్లు కోల్పోయి 25,585.5 వద్ద ముగిసింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి ప్రధాన కంపెనీల త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. రంగాల వారీగా చూస్తే రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ దాదాపు 2 శాతం క్షీణించగా, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా సూచీలు 1.5 శాతం పైగా నష్టపోయాయి. అయితే, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో కొంత కొనుగోళ్ల మద్దతు కనిపించింది.

అంతర్జాతీయంగానూ సెంటిమెంట్ బలహీనంగా ఉంది. గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేసే ప్రతిపాదనను కొన్ని యూరప్ దేశాలు వ్యతిరేకించడంతో, వాటిపై పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామం ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని పెంచి, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

'నిఫ్టీకి తక్షణ మద్దతు 25,494 వద్ద, ఆ తర్వాత 25,400?25,350 జోన్‌లో బలమైన మద్దతు ఉంది" అని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. మిశ్రమ కార్పొరేట్ ఫలితాలు, ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో మార్కెట్లు కొంతకాలం కన్సాలిడేషన్ జోన్‌లోనే కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాలు కొనసాగాయి. మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం మేర నష్టపోయాయి.

## ఆగని వెండి పరుగులు..

రూ.3 లక్షలు దాటిన కిలో ధర




**న్యూఢిల్లీ:** వెండి ధరలకు ఇప్పట్లో ఫుల్‌స్టాప్ పడేలా లేదు. శరవేగంగా వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో కిలో వెండి ధర తొలిసారి రూ.3 లక్షల మార్క్ దాటింది. మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.13,553 పెరిగి రూ.3,01,315 చేరింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు వెండి ధర రికార్డు స్థాయిలో 94.35 డాలర్లకు పెరిగింది. మరోవైపు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,480కు చేరింది.

అంతర్జాతీయంగా వెండికి నెలకొన్న డిమాండ్, వెండి పథకాల్లోకి ఇటీవల కాలంలో పెద్దఎత్తున పెట్టుబడుల ప్రవాహం పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, బలహీనంగా కదలాడుతోన్న అమెరికా డాలర్.. ఇలా ఇవన్నీ వెండి గిరాకీకి అనుకూలంగా మారాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాల వడ్డింపు ఫలితంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరిగి ? వృద్ధి మందగించటం తదితర కారణాలవల్ల కూడా ఇన్వెస్టర్లు వెండి, బంగారంపై పెట్టుబడులు సురక్షితమని భావిస్తున్నారు.

దాంతో బంగారం, వెండి కొనుగోళ్లు పెరిగాయి. ఫలితంగా వాటి ధరలు పరుగులు తీస్తున్నాయి. వెండికి ఆభరణాల రంగాన్ని మించి, పారిశ్రామిక గిరాకీ అధికం. సెమీకండక్టర్, సౌర విద్యుత్తు, విద్యుత్తు వాహన విభాగాల నుంచి వెండికి గిరాకీ పెరుగుతోంది. ధర పెరుగుతున్నందున, ఎక్కువ మంది వెండి ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెడుతున్నారు. ధర బాగా అధికమయ్యేందుకు ఇది దోహదపడుతున్నది.

## భారత్ కోకింగ్ కోల్ బంపర్ లిస్టింగ్..

ఇన్వెస్టర్లకు డబుల్ బొనాంజా




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ సంస్థ కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్‌లోకి బంపర్ ఎంట్రీ ఇచ్చింది. ఇష్యూ ధర రూ.23 కాగా.. 96.5 శాతం ప్రీమియంతో లిస్టయ్యింది. బీఎస్ఈలో 96.56 శాతం ప్రీమియంతో రూ.45.21 వద్ద లిస్ట్ కాగా.. ఎన్ఎస్ఈలో 95.65 శాతం ప్రీమియంతో రూ.45 వద్ద లిస్టింగ్‌కు వచ్చింది. అంటే ఐపీఓలో షేర్లు అలాట్ అయినవారు దాదాపు రెట్టింపు ప్రతిఫలం పొందారన్నమాట. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.19,456.965 కోట్లుగా తేలింది.

భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ రూ.1,071 కోట్ల ఐపీఓలో భాగంగా ధరల శ్రేణిని రూ.21-23గా కంపెనీ నిర్ణయించింది. 2026లో మెయిన్‌బోర్డు కేటగిరీలో ఐపీఓకు వచ్చిన తొలి కంపెనీ కాగా.. ఆరంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. చివరిరోజు నాటికి రూ.1.17 లక్షల కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. మొత్తంగా 146.81 రెట్ల స్పందన అందుకుంది. దీంతో బంపర్ లిస్టింగ్‌ను ముందే ఊహించారు. అందుకు తగ్గట్టే లిస్టింగ్‌లో అదరగొట్టింది. 1972లో భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. జారియా (ఝార్ఖండ్), రాణిగంజ్ (పశ్చిమ బెంగాల్)లోని కోల్ మైన్స్ నుంచి కోకింగ్ కోల్‌ను సరఫరా చేస్తోంది. కోల్ ఇండియా వాల్యూ అన్‌లాక్‌లో భాగంగా అనుబంధ సంస్థలో వాటాలను ప్రభుత్వం విక్రయించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారా కోల్ ఇండియా 46.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించింది. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా నష్టంతో 83,039.21 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 165 పాయింట్ల నష్టంతో 25,529.25 వద్ద కొనసాగుతోంది.

# రోహిత్ ఫామ్‌లోనే ఉన్నాడు.. కానీ..

కెప్టెన్ గిల్ కీలక వ్యాఖ్యలు

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో విఫలమైన రోహిత్ శర్మ

రోహిత్ ఫామ్‌పై వస్తున్న విమర్శలపై స్పందించిన కెప్టెన్ గిల్

రోహిత్ అద్భుతమైన ఫామ్‌లోనే ఉన్నాడని మద్దతు

మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయాడని వ్యాఖ్య




**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బ్యాట్స్‌మన్‌గా నిరాశపరిచిన సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మకు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మద్దతుగా నిలిచాడు. రోహిత్ అద్భుతమైన ఫామ్‌లోనే ఉన్నాడని, అయితే లభించిన మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మార్చడంలో విఫలమయ్యాడని పేర్కొన్నాడు. కివీస్‌తో జరిగిన మూడు వన్డేల



సిరీస్‌ను భారత్ 1-2 తేడాతో కోల్పోయిన విషయం తెలిసిందే. భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి వన్డే సిరీస్ విజయం కావడం గమనార్హం.

ఇండోర్‌లోని హోల్కర్ క్రికెట్ స్టేడియంలో జరిగిన చివరి వన్డేలో 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ 13 బంతుల్లో 11 పరుగులు చేసి నిరాశపరిచాడు. ఈ సిరీస్ మొత్తంలో మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి 20.33 సగటుతో కేవలం 61 పరుగులు మాత్రమే చేసిన రోహిత్, ఒక్క అర్ధశతకం కూడా నమోదు చేయలేకపోయాడు.

మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో గిల్ మాట్లాడుతూ.. "రోహిత్ శర్మ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని నేను భావిస్తున్నాను. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌ల నుంచి కూడా అతను మంచి టచ్‌లో ఉన్నాడు. అయితే, వచ్చిన మంచి ఆరంభాలను ప్రతీసారి భారీ స్కోర్లుగా మలచడం సాధ్యం కాదు. ఈ న్యూజిలాండ్ సిరీస్‌లోనూ రోహిత్‌కు కొన్ని మంచి ఆరంభాలు లభించాయి" అని తెలిపాడు.

"ఒక బ్యాట్స్‌మన్‌గా, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని సెంచరీలుగా మార్చాలని ఎప్పుడూ ప్రయత్నిస్తాం. కానీ, అది ప్రతిసారీ సాధ్యం కాదు. అయినప్పటికీ, దానికోసమే మేం నిరంతరం శ్రమిస్తాం" అని గిల్ వివరించాడు. రోహిత్ త్వరలోనే మళ్లీ భారీ స్కోర్లు సాధిస్తాడనే నమ్మకాన్ని గిల్ తన మాటల ద్వారా వ్యక్తం చేశాడు.

## అసలేం జరుగుతోంది...?

టీమిండియా ఓటమిపై సీవీ ఆనంద్ ట్వీట్ వైరల్

మూడో వన్డేలో న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓటమి

2-1తో సిరీస్ చేజిక్కించుకున్న కివీస్

భారత క్రికెట్‌లో ఏం జరుగుతోందంటూ ఘాటుగా ప్రశ్నించిన సీవీ ఆనంద్




**న్యూఢిల్లీ:** టీమిండియా ప్రదర్శనపై తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ చేసిన ఓ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యూజిలాండ్ చేతిలో వన్డే సిరీస్ కోల్పోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేశారు. "భారత క్రికెట్‌లో అసలేం జరుగుతోంది?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు.

మూడో వన్డేలో ఓటమితో, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-2 తేడాతో న్యూజిలాండ్‌కు సమర్పించుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలో కివీస్ చేతిలో టీమిండియా సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలోనే స్పందించిన సీవీ ఆనంద్, గత ఏడాది టెస్టు సిరీస్‌లోనూ 0-3 తేడాతో ఓడిపోయామన్న విషయాన్ని గుర్తుచేశారు.

"ఈరోజు న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ 1-2 తేడాతో ఓడిపోయింది. చరిత్రలో ఇది తొలిసారి! గతేడాది మన సొంత గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌లో న్యూజిలాండ్ మనల్ని 3-0 తేడాతో ఓడించింది. అదీ చరిత్రలో మొదటిసారే!!

## భారత్‌లో ఆడకుంటే వేటు తథ్యం..

బంగ్లాదేశ్‌ను హెచ్చరించిన ఐసీసీ..!

**న్యూఢిల్లీ:** పురుషుల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాలని పట్టుపట్టిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఆ బోర్డు ప్రతిపాదించిన 'గ్రూప్ స్వాపింగ్‌కు' అంగీకరించమని క్రికెట్ ఐర్లాండ్ స్పష్టం చేయడమే ఆలస్యం.. భారత్‌లోనే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆదేశించింది. కాదు.. కుదరదు అని బెట్టు చేస్తే కొత్త జట్టుకు అవకాశమిస్తామని బంగ్లా బోర్డును ఐసీసీ హెచ్చరించింది. అంతేకాదు ఆడుతారా? టోర్నీ నుంచి తప్పించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేసింది.

భద్రతా కారణాలరీత్యా భారత్‌లో ప్రపంచకప్ ఆడకుండా ఉండేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేస్తున్న ప్రయత్నాలు అన్నీ బెడిసి కొడుతున్నాయి. ఒక్కొక్కటిగా బంగ్లా బోర్డుకు అన్ని దారులు మూసుకుపోతున్నాయి. గ్రూప్ స్వాపింగ్ చేయాలని ఐసీసీకి విన్నవించుకున్నా నిరాశే ఎదురైంది. ఎందుకంటే.. తమను గ్రూప్ బీలోకి మార్చాలని అభ్యర్థించిన బంగ్లాదేశ్ ఆశలపై క్రికెట్ ఐర్లాండ్ నీళ్లు చల్లింది. ఎట్టిపరిస్థితుల్లోనూ గ్రూప్ మారబోమని, శ్రీలంకలోనే తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఆదివారం ఐర్లాండ్ స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో బంగ్లా బోర్డుకు మరో అవకాశమిచ్చింది ఐసీసీ. భారత్‌లోనే ప్రపంచకప్ ఆడాలని బంగ్లాకు స్పష్టం చేసింది. అందుకు



అంగీకరించకుంటే.. ఏకంగా టోర్నీ నుంచే తప్పిస్తామని ఆ దేశ బోర్డును ఐసీసీ హెచ్చరించింది. మంకుపట్టు వదిలేసి ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడుతారా? టోర్నీ నుంచి తొలగించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోండి. జనవరి 21 వరకూ మీ నిర్ణయాన్ని తెలియజేయాలని బంగ్లా బోర్డుకు స్పష్టం చేసింది ఐసీసీ. దాంతో.. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న బీసీబీ సభ్యులు 'అయ్యో.. ఇలా జరిగిందేంటీ?' అని తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ ఐసీసీ హెచ్చరికను బంగ్లాబోర్డు బేఖాతరు చేస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం దక్కనుందని సమాచారం.

### నచ్చజెప్పాలని చూసినా..

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. శనివారం ఐసీసీ ప్రతినిధులు ఢాకాలో బంగ్లాదేశ్ బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో ఆడకూడదనే నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని ఐసీసీ బృందం నచ్చజెప్పాలని చూసింది. కానీ, బంగ్లా బోర్డు మెంబర్స్ మాత్రం అందుకు అంగీకరించలేదు.


## ఐపీఎల్‌ను కాపీ కొడుతూ.. తొలిసారి ఆటగాళ్ల వేలానికి శ్రీకారం..!

**ఇస్లామాబాద్:** టీ20 క్రికెట్‌లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ పలు దేశాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఆదరణ పెరగడంతో అందరూ ఐపీఎల్ తరహాలోనే వేలాన్ని నిర్వహిస్తున్నాయి. ఇప్పుడు పాకిస్థాన్ సూపర్ లీగ్ కూడా మన ఐపీఎల్‌నే కాపీ కొడుతోంది. ఇన్నాళ్లుగా అనుసరిస్తున్న లాటరీ విధానానికి స్వస్తి పలికి.. వేలం ప్రక్రియకు నాంది పలుకనుంది. వచ్చే సీజన్ నుంచే యాక్షన్ ద్వారా ఆటగాళ్లను కొనే పద్ధతిని పీసీబీ అనుసరించనుంది.

పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోని ఫ్రాంచైజీలు ఇప్పటివరకూ ఆటగాళ్లను లాటరీ విధానం(డ్రాఫ్ట్)లో తీసుకునేవి. 2016లో లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే పద్ధతిని పాటిస్తున్నాయి. ఇకపై వేలం ద్వారా క్రికెటర్లను కొనబోతున్నాయి.వచ్చే పదకొండో సీజన్ నుంచి పీఎస్ఎల్ సరికొత్తగా ఉండనుందని సోమవారం పీఎస్ఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సల్మాన్ నసీర్ వెల్లడించాడు.

'పీఎస్ఎల్‌లో భారీ మార్పు రాబోతోంది. ఇన్నాళ్లు లాటరీ ద్వారా ఆటగాళ్లను తీసుకునేవాళ్లం. ఇకపై వేలం విధానాన్ని అనుసరించబోతున్నాం. ఫలితంగా పారదర్శకతతో పాటు పోటీతత్వం కూడా పెరుగుతుంది' అని సల్మాన్ నసీర్ తెలిపాడు. అంతేకాదు 1.3 మిలియన్ యూఎస్ డాలర్లుగా ఉన్న ఫ్రాంచైజీల పర్స్‌ను 1.6 మిలియన్ యూఎస్ డాలర్లకు పెంచుతున్నామని ఆయన వెల్లడించాడు.




### నలుగురికి ఛాన్స్..

ఐపీఎల్ తరహాలో వేలం ద్వారా ఆటగాళ్లను కొనే ప్రక్రియకు పచ్చజెండా ఊపిన నిర్వాహకులు.. ఎంతమందిని అట్టిపెట్టుకోవాలనే విషయంపైనా కసరత్తు చేశారు. ప్రతి ఫ్రాంచైజీ గరిష్టంగా నలుగురిని రీటైన్ చేసుకునేందుకు అనుమతించారు. ఇంతకుముందు ఎనిమిది మందిని అట్టిపెట్టుకునే వీలుండేది. అంతేకాదు.. మెంటర్, బ్రాండ్ అంబాసిడర్, రైట్ టు మ్యాచ్ నిబంధనలను కూడా రద్దు చేసింది. మార్చి 26వ తేదీ నుంచి పీఎస్ఎల్ పదకొండో సీజన్ షురూ కానుంది. ఆలోపే వేలం ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఈ లీగ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ క్యాలండర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్ జట్లు పాల్గొంటున్నాయి.



# బాలీవుడ్‌లో మరో ఛాన్స్ దక్కించుకున్న కీర్తి సురేష్?

### టైగర్ ష్రాఫ్ సినిమాతో కొత్త ఆరంభమా?

**టాకీస్:** కీర్తి సురేష్ పేరు వినగానే దక్షిణాది ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది ఆమె నటన, ఎంపిక చేసుకునే కథలు. మలయాళీ అయినప్పటికీ, కథానాయికగా ఆమె సినీ ప్రయాణం మాత్రం తెలుగు చిత్రసీమలోనే ప్రారంభమైంది. రామ్ పోతినేని సరసన నటించిన 'నేను శైలజ'తో తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించిన కీర్తి, ఆ సినిమాతోనే హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత 'మహానటి'లో సావిత్రి పాత్రతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడమే కాకుండా జాతీయ అవార్డును కూడా సొంతం చేసుకుంది.తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుసగా సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదిగిన కీర్తి, కొంతకాలం క్రితం బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అయితే ఆమె హిందీ డెబ్యూ ఆశించిన స్థాయిలో ఫలితాన్ని ఇవ్వలేదు.

విజయ్ హీరోగా నటించిన 'తేరి' సినిమాను హిందీలో 'బేబీ జాన్'గా రీమేక్ చేయగా, అందులో సమంత పాత్రను కీర్తి సురేష్ పోషించింది. కానీ ఈ సినిమా బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దాంతో హిందీ సినీ పరిశ్రమలో ఆమె తొలి ప్రయత్నం నిరాశనే మిగిల్చింది. అయితే, ఒక్క ఫ్లాప్‌తో అవకాశాలు ఆగిపోలేదు. 'బేబీ జాన్' విడుదల సమయంలో, పెళ్లి అయిన కొద్ది రోజులకే కీర్తి సురేష్ ప్రమోషన్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం బాలీవుడ్ నిర్మాతలు, దర్శకుల దృష్టిని ఆకర్షించింది. ప్రొఫెషనలిజం, కమిట్మెంట్ ఉన్న నటి అనే పేరు ఆమెకు రావడంతో మరోసారి అవకాశం ఇవ్వాలనే ఆలోచన బలపడినట్లు తెలుస్తోంది.

తాజా సమాచారం ప్రకారం, టైగర్ ష్రాఫ్ హీరోగా రూపొందుతున్న ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కీర్తి సురేష్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ చిత్రంలో 'తుపాకీ' ఫేమ్ విద్యుత్ జమ్వాల్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నాడని సమాచారం. భారీ యాక్షన్ సన్నివేశాలతో రూపొందే ఈ సినిమాతో కీర్తి హిందీలో తన స్థానం మరింత బలపర్చుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభించిన తర్వాత కీర్తి కొంతకాలం సినిమాలకు విరామం తీసుకుంది. ఇప్పుడు మళ్లీ వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతోంది. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి 'రౌడీ జనార్ధన' చిత్రంలో నటిస్తుండగా, తమిళం, మలయాళంలో కూడా కొత్త సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. అంతేకాదు, ఈ ఏడాది హిందీ వెబ్ సిరీస్ 'అక్క'లో కూడా ఆమె కనిపించనుంది.


## దుల్కర్ హీరోయిన్ సాత్విక గ్లింప్స్ విడుదల



**టాకీస్:** దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆకాశంలో ఒక తార' . ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌ను పరిచయం చేశారు. సాత్విక వీరవల్లి ఇందులో కథానాయికగా నటించనున్నట్లు తెలుపుతూ గ్లింప్స్ విడుదల చేశారు. కనీస వసతులు కూడా లేని పల్లెటూరిలో పుట్టిన అమ్మాయి తన కలలను ఎలా సాధించుకుంది అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నట్లు గ్లింప్స్ ఆధారంగా తెలుస్తోంది. వేసవి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది.

## షూటింగ్‌లో చేదు అనుభవం..

### స్టార్ హీరో అసభ్య ప్రవర్తనపై పూజ హెగ్డే సంచలన వ్యాఖ్యలు



**టాకీస్:** టాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజ హెగ్డే తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించడంతో, ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇంటర్వ్యూలో పూజ హెగ్డే మాట్లాడుతూ, తన కెరీర్ బిగినింగ్‌లోనే ఓ భారీ పాన్ ఇండియా సినిమాలో అవకాశం వచ్చిందని తెలిపింది. ఆ ప్రాజెక్ట్ పాన్ ఇండియా స్టార్ హీరోతో ఉండటంతో చాలా ఆనందంగా ఒప్పుకున్నానని చెప్పింది. అయితే షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పూజ వెల్లడించింది. "ఆ సినిమా షూటింగ్ సమయంలో నా అనుమతి లేకుండానే ఆ హీరో నా క్యారవాన్‌లోకి వచ్చాడు. అప్పటికే అది నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. ఆ తర్వాత అతడు నాతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ క్షణంలో నాకు ఏమి చేయాలో కూడా అర్థం కాలేదు. చాలా షాక్‌కు గురయ్యాను" అని పూజ చెప్పింది. ఆ పరిస్థితిని తట్టుకోలేకపోయిన తాను సహనం కోల్పోయానని, వెంటనే అతడిని లాగిపెట్టి కొట్టానని పూజ సంచలన వ్యాఖ్యలు చేసింది. "అలా చేయగానే అతడు వెంటనే క్యారవాన్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత అతడితో కలిసి నటించాలనే ఆసక్తి నాకు పూర్తిగా పోయింది. అందుకే నా సీన్స్‌ను డూప్‌తో షూట్ చేశారు" అని ఆమె వివరించింది.

అయితే ఈ ఘటనలో తనతో అసభ్యంగా ప్రవర్తించిన హీరో ఎవరో మాత్రం పూజ హెగ్డే వెల్లడించలేదు. పేరు చెప్పకుండా వదిలేయడంతో, సోషల్ మీడియాలో నెటిజన్లు రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. మహిళా నటులు ఇండస్ట్రీలో ఎదుర్కొనే ఇబ్బందులపై మరోసారి ఈ వ్యాఖ్యలు చర్చను రేపాయి. ఇక ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే, పూజ హెగ్డే ప్రస్తుతం దళపతి విజయ్‌తో కలిసి 'జన నాయగన్' అనే భారీ చిత్రంలో నటిస్తోంది. ఇది విజయ్ చివరి సినిమాగా ప్రచారం జరుగుతుండగా, సంక్రాంతి సీజన్‌లో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్‌పై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మొత్తంగా, పూజ హెగ్డే చేసిన ఈ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో మహిళల భద్రత, గౌరవం అంశాలపై మరోసారి పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి.

## మన శంకర వరప్రసాద్ దూకుడు

### 292 కోట్ల గ్రాస్ కలెక్షన్లతో రికార్డు

**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా ఆకట్టుకునేలా రూపొందిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచే హౌస్‌ఫుల్ షోలను నమోదు చేస్తూ, అద్భుతమైన వసూళ్లతో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా మొదటి వారం పూర్తయ్యే సరికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.292 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఇదే జోరు కొనసాగితే, అతి త్వరలోనే రూ.300 కోట్ల




క్లబ్‌లోకి ఈ చిత్రం అడుగుపెట్టడం ఖాయమని అంటున్నారు. ఈ స్థాయి వసూళ్లతో 2026 సంవత్సరానికి టాలీవుడ్‌కు అదిరిపోయే ఆరంభం లభించినట్లైంది. సంక్రాంతి బరిలో విడుదలైన ఇతర చిత్రాలతో పోలిస్తే, 'మన శంకర వరప్రసాద్ గారు' స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో నిలిచింది. బలమైన కథనం, అనిల్

## సెకండ్ ఇన్నింగ్స్‌లో రేణూదేశాయ్

**టాకీస్:** టాలీవుడ్ ప్రేక్షకులకు రేణు దేశాయ్ పేరు ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా ఆమె కీలక పాత్రలకే ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారు. రవితేజ హీరోగా నటించిన టైగర్ నాగేశ్వరరావు సినిమాలో కనిపించిన రేణు దేశాయ్, ఆ తర్వాత కూడా పలు అవకాశాలు తనను వెతుక్కుంటూ వచ్చినట్టు ఇటీవల వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రేణు దేశాయ్, సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన సర్కారు వారి పాట సినిమాలో తనకు అవకాశం వచ్చిందని తొలిసారిగా వెల్లడించారు. ఆ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం దర్శక నిర్మాతలు తనను సంప్రదించారని, కథ, పాత్ర రెండూ తనకు



బాగా నచ్చాయని ఆమె చెప్పారు. నటించాలనే ఆసక్తి కూడా ఉన్నప్పటికీ, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని తెలిపారు.



## వరుణ్‌తేజ్ మూవీ 'కొరియన్ కనకరాజు'

**టాకీస్:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' పై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ కామెడీ-ఫాంటసీ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా పై క్రేజ్‌ను మరింత పెంచింది. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్ట్ టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేయగా, అది అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాతో వరుణ్ తేజ్ తొలిసారిగా హారర్ ఫాంటసీ జానర్‌లో అడుగుపెడుతున్నారు. గ్లింప్స్‌లో ఆయన మాస్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విదేశాల్లోని ఒక పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే సన్నివేశంలో, కమెడియన్ సత్యను పోలీసులు కొడుతుండటం, ఆ సమయంలో కామెడీ ట్రాక్ నడుస్తూనే హీరో స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం ప్రేక్షకులకు హుషారును కలిగిస్తోంది. 'వీడు మన కనకరాజు కాదమ్మో' అంటూ సత్య చెప్పే డైలాగ్‌కు, 'నేను తిరిగొచ్చేశా' అంటూ వరుణ్ తేజ్ కొరియన్ భాషలో ఇచ్చే కౌంటర్ ప్రత్యేకంగా హైలైట్ అవుతోంది. ఈ సన్నివేశం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే సీనియర్ నటి తులసి, కమెడియన్ సత్య కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్లపై ఈ సినిమాను భారీ స్థాయిలో సంయుక్తంగా నిర్మిస్తున్నారు. లెజెండరీ కంపోజర్ తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. వరుణ్ తేజ్ ? తమన్ కాంబోలో గతంలో వచ్చిన 'తొలిప్రేమ' సినిమా మ్యూజికల్‌గా పెద్ద హిట్ కావడంతో, ఈ సినిమాపై కూడా మ్యూజిక్ పరంగా భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ సినిమాను సమ్మర్ సీజన్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.